## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తుమ్మల పరామర్శ

ఖమ్మం, డిసెంబర్ 13: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం కలిశారు. తుంటి శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను తుమ్మల కలిసి పరామర్శించారు.


మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శిస్తున్న తుమ్మల

# మాతాశిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మరణాలు జరిగితే కఠిన చర్యలు
- ప్రసవానికి వచ్చిన గర్భిణులకు తక్షణమే వైద్య సేవలు
- వైద్యాధికారుల సమీక్షలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): వైద్యాధికారులు మాతాశిశు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. మాతృ, శిశు మరణాలపై వైద్య ఆరోగ్యశాఖాధికారులతో ఐడీవోసీలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ముందుగా పర్ణశాల, దుమ్ముగూడెం, అశ్వారావుపేట ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన మరణాలకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. గర్భ నిర్ధారణ జరిగిన నాటినుంచి ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు గర్భిణుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. హైరిస్క్ ఉన్న మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రసవానికి ఆస్పత్రికి వచ్చిన సమయాల్లో తక్షణమే వైద్యసేవలు అందించాలని చెప్పారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మరణాలు జరిగితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యాధికారులు శిరీష, రవిబాబు, రాజ్‌కుమార్, సుకృత, రామకృష్ణ, చైతన్య, సరళ, సింధు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ సమీక్షలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

**చిన్నారుల ఆరోగ్యంపై పర్యవేక్షణ**

గర్భిణి నుంచి ఆరోగ్యవంతమైన చిన్నారుల జననం వరకు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సేవలపై సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషణలోప చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లా సంక్షేమాధికారి విజేత తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ దుర్ఘటనపై దర్యాప్తు జరపాలి

- దాడుల గురించి పత్రికల్లో వస్తున్నా కేంద్రం చర్యలు తీసుకోలేదు
- బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, డిసెంబర్ 13: పార్లమెంట్‌లో బుధవారం జరిగిన ఘటనపై కేంద్ర హోంమంత్రితో తక్షణమే సమగ్ర ప్రకటన చేయించాలని బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నేతృత్వంలో పార్లమెంట్ దుర్ఘటనపై చర్చించేందుకు బుధవారం జరిగిన ఆల్ పార్టీ మీటింగ్ అనంతరం ఎంపీ నామా విలేకరులతో మాట్లాడారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు పార్లమెంట్ ముందుంచాలని ఆల్ పార్టీ మీటింగ్‌లో స్పీకర్‌ను కోరినట్లు చెప్పారు. దాడులు జరిగే ప్రమాదం ఉందని కొంతకాలంగా పత్రికల్లో కథనాలు వస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. భద్రతా వైఫల్యం కారణంగానే ఈ ఘటన జరిగినట్లు భావిస్తున్నామన్నారు. సరిగ్గా 22 ఏళ్ల కిందట ఇదే రోజున పార్లమెంట్ బయట ఉగ్ర దాడి జరిగి పలువురు అమరులయ్యారని గుర్తుచేశారు. ఇప్పుడు ఏకంగా పార్లమెంట్ లోపలే ఘటన చోటుచేసుకుందని అన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

**భద్రాచలం ఐటీడీఏ పీవోకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సూచన**

దుమ్ముగూడెం, డిసెంబర్ 13: మండలంలోని సీతారాంపురం గ్రామంలో రైతుల పంటల విక్రయం కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్‌కు సూచించారు. ఈ మేరకు బుధవారం పీవోను ఎమ్మెల్యే కలిసి ఈ సమస్యను వివరించారు. ఇటీవల తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే, గిరిజన గ్రామాలకు త్రీఫేజ్ కరెంటు అందించాలని, నియోజకవర్గంలో పోడు భూములకు కూడా కరెంటు సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలపై పీవో సానుకూలంగా స్పందించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.


ఐటీడీఏ పీవోతో మాట్లాడుతున్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

## అమరవీరులకు 'వద్దిరాజు' నివాళి

ఖమ్మం, డిసెంబర్ 13: పార్లమెంటుపై పాకిస్తాన్ ముష్కరులు 2001లో దాడి చేసిన దుర్ఘటనలో అసువులుబాసిన అమరవీరులకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర బుధవారం నివాళులర్పించారు. పాకిస్తాన్ ఉగ్రవాదులు 2001లో ఇదే రోజున (డిసెంబర్ 13న) మన పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో మారణాయుధాలతో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. నాటి దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరులను స్మరించుకుంటూ పార్లమెంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీ రవిచంద్ర హాజరై వారి చిత్రపటాలకు పూలుచల్లి శ్రద్ధాంజలి ఘటించారు.


అమరవీరులకు నివాళులర్పిస్తున్న వద్దిరాజు

**బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి**

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో వెంటనే బిల్లు ప్రవేశపెట్టాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై మరో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో ఢిల్లీలో బుధవారం జరిగిన మహాధర్నాకు ఎంపీలు వద్దిరాజు, బడుగుల లింగయ్య యాదవ్ హాజరై మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ తెలంగాణ తొట్టతొలిత అసెంబ్లీ సమావేశాల్లోనే అప్పటి సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఏకగ్రీవంగా తీర్మానించిన విషయాన్ని గుర్తు చేశారు.

## డీసీసీబీ సీఈవోగా రెహమాన్ బాధ్యతల స్వీకరణ

**అసిస్టెంట్ మేనేజర్ నుంచి డీజీఎం వరకూ విశేష అనుభవం**

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 13: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో)గా అబీద్ ఉర్ రెహమాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సీఈవోగా పనిచేసిన అట్లూరి వీరబాబు ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో నూతన సీఈవో ఎంపికను టెస్కాబ్ చేపట్టింది. అసెంబ్లీ ఎన్నికల ముందుగానే ఇంటర్వ్యూ ప్రక్రియ చేపట్టిన టెస్కాబ్ అధికారులు.. అందుకు అనుగుణంగా సీఈవోగా రెహమాన్‌ను ఎంపిక చేశారు. పాలకవర్గ ఆమోదం తరువాత ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన రహమాన్.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో 1993లో అసిస్టెంట్ మేనేజర్ (క్లర్క్)గా విధుల్లో చేరారు. 2023లో డీజీఎంగా పదవీ విరమణ పొందారు. మొత్తం 18 మంది అధికారులు ఇంటర్వ్యూకు హాజరు కాగా.. చివరకు రెహమాన్‌ను టెస్కాబ్ ఎంపిక చేసింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఈవో రెహమాన్ మాట్లాడుతూ.. గడిచిన మూడేళ్లుగా ఖమ్మం డీసీసీబీ అద్భుత ప్రగతి కొనసాగిస్తోందని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో రెండో స్థానంలో ఉన్న ఈ బ్యాంకును ప్రథమ స్థానంలో నిలిపేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు.


అబీద్ ఉర్ రెహమాన్

## సీఎం ఢిల్లీ పీఆర్వోగా కారేపల్లి వాసి



కారేపల్లి, డిసెంబర్ 13: సీఎం రేవంత్‌రెడ్డికి ఢిల్లీ పీఆర్వోగా కారేపల్లి మండల వాసిని నియమిస్తూ సీఎస్ శాంతికుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని కొత్తకమలాపురానికి చెందిన దూదిపాళ్ల విజయ్‌కుమార్ 17 ఏళ్లుగా ఢిల్లీలో ఓ ప్రధాన పత్రిక ప్రతినిధిగా విధులు నిర్వహిస్తున్నాడు. రేవంత్‌రెడ్డికి అత్యంత సానిహితుడైన విజయ్‌కుమార్.. ఆయనకు ఢిల్లీ పీఆర్వోగా ఎంపిక కావటం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## 'తొలిమెట్టు', 'ఉన్నతి'లను పరిశీలించిన రాష్ట్ర బృందం

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 13: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర బృందం పరిశీలించింది. జిల్లాలో చింతకాని, కామేపల్లి, కొణిజర్ల, సింగరేణి, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను బృంద సభ్యులు బుధవారం సందర్శించారు. బృందంలోని రవికాంత్, రమేశ్‌లు విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలను పరిశీలించారు. ఉదయం పలు పాఠశాలల్లో ప్రార్థన సమయంలో పాల్గొని విద్యార్థులను ప్రశ్నించారు. ప్రధానోపాధ్యాయులు, మండలాల నోడల్ అధికారులు, ఎంఈవోలు, కేజీబీవీ ఎస్‌వో, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లతో రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమీక్ష నిర్వహించారు. తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల అమలులో పరిశీలించిన అంశాలను వివరించడంతో పాటు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. డీఈవో సోమశేఖర శర్మ, ఏఎంవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొత్త చాంబర్‌లోకి పొంగులేటి

ఖమ్మం, డిసెంబర్ 13: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సచివాలయంలో తనకు కేటాయించిన కొత్త చాంబర్‌లోకి గురువారం ప్రవేశించనున్నారు. అనంతరం ఆయా శాఖల మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారు. సెక్రటేరియట్ గ్రౌండ్ ఫ్లోర్ (రూమ్ నంబర్ 10, 11, 12)లో ఉదయం 9 గంటలకు ఆశీనులు కానున్నారు.

## జాతీయ క్రీడాకారులకు భద్రాద్రి కలెక్టర్ అభినందన

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 13 : 67వ జాతీయస్థాయి పాఠశాలల క్రీడలకు ఎంపికైన భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన అథ్లెటిక్స్, కరాటే క్రీడాకారులను కలెక్టర్ ప్రియాంక ఆల బుధవారం ఐడీవోసీలో అభినందించారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన వేదశ్రీ, మధుప్రియ డిస్కస్‌త్రో, శ్రీవిద్యా దొర లాంగ్‌జంప్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆశశ్రీ 400 మీటర్లు, బి.పల్లవి హామర్ త్రో, అమీన్ 100 మీటర్లు హర్డిల్స్‌లో ఎంపికయ్యారు. ఎం.సంగీత 3కిలోమీటర్లు పరుగులో, రియాజ్‌పాషా డిస్కస్‌త్రోలో, షాట్‌లో, జే.వరుణ్ 400 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెంలో, ఎం.అఖిల్ 1500 మీటర్లు, 3 కిలోమీటర్లు విభాగంలో, ఎం.ప్రేమ్‌కుమార్ 6కిలోమీటర్లు, బి.సాయివరుణ్ కరాటేలో ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ పోటీలు ఈ నెల 16 నుంచి లక్నోలో, కరాటే జాతీయస్థాయి పోటీలు ఈ నెల 15 నుంచి ఢిల్లీలో జరగనున్నాయి.

## ఖమ్మం ఏఎంసీకి 17 వేల పత్తి బస్తాలు

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 13: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని పత్తియార్డుకు ఆయా జిల్లాలకు చెందిన రైతులు భారీగా పంటను తీసుకొచ్చారు. బుధవారం అమావాస్య కారణంగా మార్కెట్‌కు సెలవు కావడంతో గురువారం భారీగా పంటను తెచ్చారు. ఉదయం ఆన్‌లైన్ బిడ్డింగ్ సమయానికిగాను 17,718 బస్తాలను రైతులు తీసుకొచ్చారు. అనంతరం ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో పత్తి గరిష్ఠ ధర క్వింటా రూ.6,650 పలికింది. మధ్య ధర రూ.6,600 కాగా, కనిష్ఠ ధర రూ.5,500 పలికింది. ఒకవైపు సీసీఐ అధికారులు పంటను కొనుగోలు చేస్తున్నప్పటికీ రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్దకు పంటను భారీగా తీసుకెళ్తున్నారు. సీసీఐకి, ప్రైవేట్ వ్యాపారులకు మధ్య ధరలో పెద్దగా తేడా లేకపోవడంతో మార్కెట్‌కు ఎక్కువ మొత్తంలో పంటను తీసుకొస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఒక్కరోజులోనే 17 వేల బస్తాలను రైతులు తీసుకురావడంతో పత్తియార్డు తెల్లబంగారంతో కళకళలాడింది.

## విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి: డీఐఈవో

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 13: వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు జిల్లా ఇంటర్ విద్యాధికారి కే.రవిబాబు సూచించారు. ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లతో నూతన కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల హాజరు శాతం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. స్లిప్‌టెస్టులు, ప్రాక్టికల్స్ నిర్వహించాలని సూచించారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంటర్ బోర్డు ద్వారా ప్రవేశ పెట్టిన ఇంగ్లిష్ ప్రాక్టికల్స్‌పై అవగాహన కల్పించాలని, ఒకేషనల్ విద్యార్థులకు ఆన్ జాబ్ ట్రైనింగ్ నిర్వహించాలని స్పష్టం చేశారు.

